

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 20 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 257 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

TUESDAY OCTOBER 20 2026 | VOL:18 | ISSUE: 257 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

ఓటర్ల జాబితాతో బీజేపీ కుట్ర: అఖిలేశ్ యాదవ్



దొంగ ఓట్లను చేర్పిస్తూ, ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని అఖిలేశ్ విమర్శ

పోలింగ్ బూత్‌ల వద్ద కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు

మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తుందని వ్యాఖ్య

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్రపూరితంగా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని, దొంగ ఓట్లను చేర్పించడంతో పాటు ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తోందని ఆయన విమర్శించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద పార్టీ కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. “మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తుంది. అందుకే (మిగతా 2వ పేజీలో..)

ఎల్‌నినో ముప్పుపై సర్కారు అప్రమత్తం!



డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు

వర్షాభావ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం

తాగునీటి సమస్యల నివారణకు ముందస్తు ప్రణాళికలు

ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగం వేగవంతం చేయాలి

నిధుల ఖర్చులో జాప్యం వద్దన్న భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 19:

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనం చేసి, కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టే లక్ష్యంతో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో కరువు పరిస్థితులు తలెత్తితే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై కేబినెట్ సబ్‌కమిటీ సమీక్షించనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించనుంది. నీటి లభ్యత, తాగునీటి సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలకు సిఫార్సులు చేయనుంది.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

జల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణంపై కమిటీ దృష్టి సారించనుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలను ప్రోత్సహించనుంది. వేసవి ప్రారంభానికి ముందే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఎల్‌నినో ప్రభావంపై నిరంతరం సమీక్ష నిర్వహించి, పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులు అందించనుంది.

సబ్‌ప్లాన్ నిధుల వినియోగం వేగవంతం చేయాలి

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్సీ,

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం!



- భూ భారతి అమలుతో పారదర్శక రెవెన్యూ వ్యవస్థకు శ్రీకారం
- రీ-సర్వేతో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం 12.40 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు। భూ హక్కుల కల్పనలో వేగం పెంచాలని అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 19:

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భూ భారతి చట్టం అమలు, రెవెన్యూ శాఖ పనితీరుపై సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మించడంతోపాటు భూ సంబంధిత సేవల్లో పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భూ హక్కుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

12.40 లక్షల మంది రైతులకు పాస్ పుస్తకాలు

(మిగతా 2వ పేజీలో..)

స్టాక్ మార్కెట్ పతనంపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు.. 2027లో ఆ ముప్పు పొంచి ఉందని హెచ్చరిక!



భారత మార్కెట్ బలహీనతకు సులభమైన నిధుల ఉపసంహరణ కూడా కారణమన్న నిర్మల

దేశ ఆర్థిక పునాదులు బలంగా ఉన్నాయని స్పష్టీకరణ

2027లో విదేశీ పెట్టుబడుల తరలింపు పెద్ద సవాలుగా మారే అవకాశం

ప్రపంచ పెట్టుబడులు ఏఐ రంగం వైపు మళ్లుతున్నాయని వెల్లడి

సెమీకండక్టర్ తయారీపై భారత్ దృష్టి పెట్టిందన్న ఆర్థిక మంత్రి

(మిగతా 2వ పేజీలో..)

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక



నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్

లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక

మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచన

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు.. కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు





మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు బీఆర్ఎస్ నోటీసులు

నోటీసులు జారీ చేసిన సోమ భరత్ కుమార్

సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్

తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని సూచన

స్పందించకపోతే పరువు నష్టం సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్,


(మిగతా 2వ పేజీలో..)

భార్యకు ఫ్రీ.. భర్తకు డబుల్ చార్జీ!

జర్మనీలో కొలువులంటూ ప్రభుత్వం మోసం: హరీశ్

హైదరాబాద్, అక్టోబరు 18 :

ఆర్టీసీ బస్సుల్లో భార్యకు ఉచిత ప్రయాణమని చెప్పి.. భర్తకు డబుల్ చార్జీ వసూలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు.



(మిగతా 2వ పేజీలో..)

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు.. 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే!



విజయ్ టీవీకేకు 2025-26లో రూ.13.3 కోట్ల విరాళాలు

మొత్తం విరాళాల్లో ఆధవ్ అర్జున, ఆర్‌వీ రంజిత్‌కుమార్ నుంచే 99 శాతం విరాళాలు

రూ.8.2 కోట్లు అందించిన ఆధవ్ అర్జున

రంజిత్‌కుమార్ రూ.5 కోట్ల విరాళం

అన్నాడీఎంకేకు రూ.161.35 కోట్లు, డీఎంకేకు రూ.191.19 కోట్ల విరాళాలు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.13.3 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందాయి. ఈ మొత్తంలో దాదాపు 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే వచ్చినట్లు భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. క్రీడలు, ప్రజాపనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున, మరో మంత్రి ఆర్‌వీ రంజిత్‌కుమార్ ఈ విరాళాల్లో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు.ఎన్నికల సంఘానికి (మిగతా 2వ పేజీలో..)

ఫ్లైదుబాయ్ ఘటన: ప్లంబర్ కథనంపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్

ఫ్లైదుబాయ్ విమాన ఘటనపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్

విమానాన్ని ప్లంబర్ కాపాడాడన్న ప్రచారాన్ని కెప్టెన్ వివరణ

ఆ సమయంలో విమానాన్ని కాపాడటంపైనే నా దృష్టి ఉందన్న పైలట్

దాడి తర్వాత ఏం జరిగిందో పూర్తిగా గుర్తులేదని వెల్లడి



తీవ్ర ప్రమాదం నుంచి ఫ్లైదుబాయ్ విమానాన్ని ఓ

(మిగతా 2వ పేజీలో..)

విజయకేరళం
తెలుగు దినపత్రిక

ఎల్‌నినో ముప్పుపై సర్కారు అప్రమత్తం!

మొదటి పేజీ తరువాయి)

ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కేటాయించిన నిధులను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వినియోగిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు.

సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యం

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ వర్గాలకు సంబంధించిన పథకాలు సమర్థంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణాల పునర్‌వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.

బడ్జెట్ ఖర్చుపై నిరంతర పర్యవేక్షణ

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, వాటి వ్యయంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో జాప్యాన్ని నివారించి, అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

స్టాక్ మార్కెట్ పతనంపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు.. 2027లో ఆ ముప్పు పొంచి ఉందని హెచ్చరిక!

మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడిదారులు తమ షేర్లను సులభంగా విక్రయించి డబ్బులు వెనక్కి తీసుకుంటుండటం కూడా స్టాక్ మార్కెట్ బలహీనపడటానికి ఒక కారణమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అయితే దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగానే ఉన్నాయని స్పష్టం చేశారు. అదే సమయంలో విదేశీ పెట్టుబడులు భారీగా తరలిపోవడం 2027లో భారత్‌కు పెద్ద సవాలుగా మారవచ్చని హెచ్చరించారు.అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాల సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మార్కెట్‌లో నగదు లభ్యత సులభంగా ఉండటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను త్వరగా ఉపసంహరించుకుంటున్నారని ఆమె వివరించారు.ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగం వైపు మళ్లుతున్నాయని సీతారామన్ పేర్కొన్నారు. ఏఐతో సంబంధం ఉన్న కంపెనీల్లో పెట్టుబడుల కారణంగా తైవాన్, దక్షిణ కొరియా మార్కెట్లపై పెట్టుబడిదారులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని వివరించారు. అమెరికా, ఏఐ రంగాల వైపు నిధులు తరలిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.అయితే ప్రపంచవ్యాప్తంగా ఏఐ పెట్టుబడుల ఊపు తగ్గి మార్కెట్లు పడిపోయినా భారత్‌పై దాని ప్రభావం తక్కువగా ఉండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. భారత్‌లో ఆ తరహా పెట్టుబడులు పెద్ద ఎత్తున రాకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. అధునాతన సాంకేతిక రంగంలో భారత్ వెనుకబడలేదని, సెమీకండక్టర్ తయారీపై కూడా పెట్టుబడులు పెడుతోందని చెప్పారు.ఈ ఏడాది ఇప్పటివరకు భారత ఈక్విటీ మార్కెట్ ప్రధాన సూచీలు దాదాపు 12 శాతం పడిపోయాయి. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోంది. అయినా విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ నుంచి భారీగా నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారత ఈక్విటీల్లో 33 బిలియన్ డాలర్లకు పైగా విలువైన షేర్లను విక్రయించారు. అక్టోబర్ 16న మాత్రం వరుసగా 15 సెషన్ల పాటు విక్రయాలు జరిపిన తర్వాత ఎఫ్‌ఐఐలు మళ్లీ నికర కొనుగోలుదారులుగా మారారు. ఆ రోజు సుమారు రూ.1,166 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. మరోవైపు, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐలు) 45 సెషన్ల కొనుగోళ్ల పరంపరను ముగించి, సుమారు రూ.3,661 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

ఓటర్ల జాబితాతో బీజేపీ కుట్ర: అఖిలేశ్ యాదవ్

మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి కుట్రలకు పాల్పడుతోంది" అని అఖిలేశ్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిన తర్వాత అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలే వేల కోట్లు ఖర్చుపెట్టి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) పూర్తి చేసిన తర్వాత, మళ్లీ ఇప్పుడు ూా= అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం బీజేపీకి అనుకూలంగా జాబితాను మార్చేందుకేనని ఆయన ఆరోపించారు.

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు.. 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే!

మొదటి పేజీ తరువాయి)

సమర్పించిన వివరాల ప్రకారం.. ఆధవ్ అర్జున రూ.8.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. రంజిత్‌కుమార్ రూ.5 కోట్లు అందించారు. దీంతో పారీకి అందిన మొత్తం విరాళాల్లో అర్జున వాటా 60 శాతానికి పైగా ఉంది. టీవీకేకు అత్యధికంగా విరాళం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఈ ఇద్దరి విరాళాలతో పాటు మరో రెండు విరాళాలు కూడా పార్టీకి అందాయి. తూత్తుకుడి జిల్లా లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో సంస్థ రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇచ్చింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ కూడా మరో రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందించింది. ఓవరాల్ గా ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.13.3 కోట్లుగా ఉంది

ఇదిలా ఉండగా 2025--26 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందుకున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ సంస్థ రూ.135 కోట్లతో అతిపెద్ద విరాళదారుగా నిలిచింది.డీఎంకేకు ఇదే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు అందాయి. ఆ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.125 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన ఈ లాటరీ సంస్థకు, తమిళనాడు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కంపెనీ రికార్డులు సూచిస్తున్నాయి. ఆ సంస్థలో నియమిత భాగస్వామిగా ఉన్న సుబ్బయన్ నాగరాజన్.. మార్టిన్‌కు చాలాకాలంగా వ్యాపార సహచరుడిగా ఉన్నట్లు సమాచారం.సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేసిన సంస్థగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ నిలిచింది. పథకం రద్దు తర్వాత బహిర్గతమైన వివరాల ప్రకారం.. ఈ సంస్థ ఎన్నికల బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.509 కోట్ల విరాళాలు అందించింది.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు.. కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు.కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది. నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

భార్యకు ఫ్రీ.. భర్తకు డబుల్ చార్జీ!

మొదటి పేజీ తరువాయి)

రద్దీ ముసుగులో పండగ పూట కాంగ్రెస్ సర్కార్ ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. 'మహిళలకు రాయితీ ఇచ్చినట్టా? లేక ఆ భారాన్ని తిరిగి అదే కుటుంబంపై మోపినట్టా? ఇదేనా ప్రజాపాలన?' అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. హైదరాబాద్ జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు రూ.230 ఉండే టికెట్‌ను ఏకంగా రూ.400కు పెంచారన్నారు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ ఎంజీబీఎ?సకు మొన్నటి వరకు రూ.220 ఉండగా ఇప్పుడు రూ.290 పైగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ టికెట్లను ఎక్స్‌లో పోస్టు చేశారు. పండుగలకు సొంతూళ్లకు వెళ్లాలంటేనే పేద, మధ్యతరగతి ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను రేవంత్ సర్కార్ నిండా ముంచిందని హరీశ్ విమర్శించారు. జర్మనీలో కొలువులంటూ ప్రభుత్వరంగ సంస్థ టామ్‌కామ్ ద్వారా 15 జిల్లాల్లోని 75 మంది నిరుద్యోగుల నుంచి వీసాలు, పరీక్షల పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.4.50 లక్షల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. వారికి ఉద్యోగాలు ఇప్పించకుండా రెండేళ్లుగా మోసం చేస్తున్నారని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఏదైనా సమస్య వస్తే 1,000 కిలోమీటర్ల దూరంలోని లక్నో కోర్టుకు వెళ్లాలని బలవంతంగా సంతకాలు పెట్టించుకున్నారని ఆరోపించారు. విదేశీ కొలువుల వ్యవహారంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, బాధితులకు నష్టపరిహారం, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి)

గత 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 5,68,858 పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. భూముల రికార్డుల్లో పారదర్శకత, హక్కుల నిర్ధారణకు ప్రాధాన్యమిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

రీ-సర్వేతో పాత సమస్యలకు పరిష్కారం

దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు రీ-సర్వే ద్వారా పరిష్కారం చూపే అవకాశం ఉందని పొంగులేటి పేర్కొన్నారు. భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగుదారులను గుర్తించడం ద్వారా అర్హులకు చట్టబద్ధమైన భూ హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భూముల వివరాల్లో తప్పులు, హక్కులకు సంబంధించిన వివాదాలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నారాయణపురంలో 906 మంది రైతులకు హక్కులు

భూ హక్కుల కల్పనలో చేపట్టిన చర్యలను వివరిస్తూ నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించినట్లు వెల్లడించారు. ఈ తరహా చర్యల ద్వారా అర్హులైన రైతులకు భూమిపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలకు వెసులుబాటు

పట్టాదారు పాస్ పుస్తకాల జారీతో రైతులకు బ్యాంకు రుణాలు పొందడంతోపాటు రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి వివరించారు. భూ రికార్డుల సమస్యల కారణంగా రైతులు సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూడాలని సూచించారు. అర్హులైన రైతులకు ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రీ-సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూ హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు సత్వర న్యాయం అందించడంతోపాటు, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

ఫ్లైదుబాయ్ ఘటన: ప్లంబర్ కథనంపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్

మొదటి పేజీ తరువాయి)

ప్లంబర్ తన సమయస్ఫూర్తితో కాపాడారంటూ వస్తున్న వార్తలను ఆ విమాన పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందించారు. ఆ ప్లంబర్ గురించి తనకు కనీస సమాచారం కూడా లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం యూఏఈలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న పైలట్ స్మిత్, అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో ఎమర్జెన్సీ తలెత్తిన సమయంలో, ప్రయాణికుడిగా ఉన్న యానివ్ హయూన్ అనే ప్లంబర్ తన సాహసంతో ప్రమాదాన్ని నివారించినట్లు వార్తలు వచ్చాయి. 'ఎయిర్ క్రాష్ ఇన్వెస్టిగేషన్' అనే టీవీ షోలో చూసిన అంశాలను ఆధారంగా చేసుకుని, కంట్రోల్ స్టిక్స్‌ను వెనక్కి లాగి విమానాన్ని స్థిరపరిచానని హయూన్ గతంలో పేర్కొన్నారు. అనంతరం విధుల్లో లేని మరో పైలట్ సహాయంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు వివరించడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది.ఈ కథనాలపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందిస్తూ, "నిజం చెప్పాలంటే ఆ ప్లంబర్ ఉదంతం గురించి నాకేమీ తెలియదు. విమానంపై ఆకస్మిక దాడి జరిగినప్పుడు, అది కూలిపోకుండా కాపాడేందుకే నేను సర్వశక్తులు ఒడ్డాను. నన్ను నేను రక్షించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించాను" అని వెల్లడించారు. విమానం కెప్టెన్ నియంత్రణలోనే ఉందంటూ ఓ సీనియర్ అధికారి చెప్పిన మాటలు మాత్రమే తనకు గుర్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఒక ప్లంబర్ విమానాన్ని ల్యాండ్ చేయగలడా అనే ఊహాగానాలపై తాను స్పందించబోనని ఆయన స్పష్టం చేశారు. దాడి జరిగిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు తనకు పూర్తిగా గుర్తులేవని కెప్టెన్ స్మిత్ వివరించారు. తీవ్రమైన దాడి జరుగుతున్నప్పటికీ, ఎంతో శ్రమించి తన సీట్ బెల్ట్ విప్పుకుని కాక్‌పిట్ తలుపులు తెరిచినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు.

వెండి బతుకమ్మపై ట్రోలింగ్.. పీవీ సింధు ఘాటు సమాధానం!

బతుకమ్మ సంప్రదాయాన్ని అర్థం చేసుకోకుండా విమర్శలు చేయొద్దని భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు సూచించింది. తనపై వస్తున్న విమర్శలకు సోషల్ మీడియా వేదికగా స్పందించింది. వెండి బతుకమ్మను బహుమతిగా అందించడంపై జరుగుతున్న ట్రోలింగ్‌కు వివరణ ఇచ్చింది. అది తన అత్తగారు చూపిన ప్రేమకు గుర్తు అని స్పష్టం చేసింది.తన పుట్టింట్లో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ జరుపుకొనే ఆచారం లేదని సింధు తెలిపింది. అందుకే ఈ ఏడాది బతుకమ్మ పండుగ తనకు మొదటిసారి అని పేర్కొంది. తెలంగాణకు చెందిన కరీంనగర్ కుటుంబంలోకి కోడలిగా అడుగుపెట్టిన తర్వాత ఈ వేడుకలో పాల్గొన్నట్లు వివరించింది.పండుగ కోసం వెనుక కనిపిస్తున్న పెద్ద పూల బతుకమ్మను తానే రోజంతా కష్టపడి పేర్చినట్లు చెప్పింది. కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో ఆనందంగా వేడుకలు జరుపుకున్నట్లు వెల్లడించింది.వెండి బతుకమ్మను తన అత్తగారు ఆప్యాయంగా అందించారని సింధు వివరించింది. తనకు ఎంతో ఇష్టమైన సంప్రదాయంలోకి కొత్త కోడలిని సాదరంగా ఆహ్వానించాలనే ఉద్దేశంతోనే ఆ బహుమతి ఇచ్చారని తెలిపింది. సంప్రదాయంతో పాటు తల్లి ప్రేమకు కూడా చోటు ఉంటుందని ఆమె పేర్కొంది. సింధు స్పందనకు పలువురు నెటిజన్లు మద్దతు తెలియజేస్తున్నారు. సంప్రదాయం వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోకుండా విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.



ట్రంప్ దెబ్బ: సగానికి పడిపోయిన అమెరికాకు వలసలు.. 91 దేశాలపై కఠిన ఆంక్షలు!

అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కఠినమైన వీసా నిబంధనల కారణంగా చట్టబద్ధమైన వలసలు ఒక్కసారిగా సగానికి పడిపోయాయి. 2025 చివరలో తీసుకువచ్చిన ఈ కొత్త విధానాల వల్ల ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికాకు వచ్చే వలసదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రభుత్వ డేటాను విశ్లేషించిన 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం ఈ పరిణామం అనేక దేశాల పౌరులపై తీవ్ర ప్రభావం చూపింది.ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ నెలకు సగటున 52,000 ఇమ్మిగ్రెంట్ వీసాలను జారీ చేసేది. ఈ వీసాలు పొందిన వారికి గ్రీన్ కార్డులు, శాశ్వత నివాస హోదా లభిస్తాయి. కానీ, కొత్త ఆంక్షల తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో కేవలం 26,000 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. ఇది ఏకంగా 50 శాతం తగ్గుదలను సూచిస్తోంది.తాజా నిబంధనల వల్ల 91 దేశాల నుంచి పౌరులు అమెరికాకు వలస రావడం దాదాపు అసాధ్యంగా మారింది. మరో 61 దేశాల వారికి అందుబాటులో ఉన్న వీసాల సంఖ్యను కూడా గణనీయంగా తగ్గించారు. ఈ ఆంక్షల ప్రభావం ముఖ్యంగా ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలపై తీవ్రంగా పడింది. ముస్లిం-మెజారిటీ దేశాల నుంచి వలసలు 90 శాతానికి పైగా క్షీణించాయి. ప్రాంతాల వారీగా చూస్తే.. సెంట్రల్ ఆసియా నుంచి వలసలు 99%, ఆఫ్రికా నుంచి 89%, తూర్పు యూరప్ నుంచి 84%, పశ్చిమాసియా నుంచి 81% మేర తగ్గాయి.అయితే, ఈ ఆంక్షల నుంచి కెనడా, మెక్సికో దేశాలకు మినహాయింపు లభించింది. కెనడా నుంచి వలసలు 142 శాతం, మెక్సికో నుంచి 17 శాతం పెరగడం గమనార్హం. భద్రతాపరమైన తనిఖీలను కఠినతరం చేయడం, వలసదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడే అవకాశాలను అంచనా వేయడానికే ఈ ఆంక్షలు విధించినట్లు ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. కేవలం ఇమ్మిగ్రెంట్ వీసాలు మాత్రమే కాకుండా, విద్యార్థులు, పర్యాటకులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలకు ఇచ్చే నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల జారీ కూడా తగ్గిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ । మంగళవారం । 20 । 2026

నల్లగొండలో నవంబర్ 15 నుంచి జాతీయ కిసాన్ మహాసభలు

లక్ష మందితో భారీ ప్రదర్శన.. 300 స్టాళ్లతో వ్యవసాయ పరికరాల ప్రదర్శన
రైతు మహాసభలను జయప్రదం చేయాలి: జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 19 (విజయ కెరటం):

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న 36వ జాతీయ కిసాన్ మహాసభలను విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయం దొడ్డి కొమురయ్య భవనంలో మహాసభల ప్రచారంలో భాగంగా బెలూన్లను ఆవిష్కరించి, ఆహ్వాన సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు.

లక్ష మందితో భారీ ప్రదర్శన

నవంబర్ 15న నల్లగొండలో లక్ష మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. మహాసభల సందర్భంగా సుమారు 300 స్టాళ్లతో వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, ఎరువులు, విత్తనాలు, నూతన వ్యవసాయ పరికరాలు, శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు వివరించారు.

రైతు వ్యతిరేక విధానాలపై చర్చ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తున్నాయని జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ప్రయత్నాలు, విద్యుత్ సవరణ బిల్లు, పంటలకు కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన హామీ లేకపోవడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రభావం వంటి అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగం కార్పొరేట్ శక్తుల ఆధీనంలోకి వెళ్లకుండా కాపాడేందుకు రైతులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రైతుల భవిష్యత్తుకు కార్యాచరణ

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, ముఖ్యంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని రైతాంగ సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, రైతుల ప్రయోజనాలకు అనుగుణమైన విధానాల అమలుపై సమగ్రంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం



మహాసభల విజయవంతానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జూలకంటి రంగారెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాలో గ్రామగ్రామాన, ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. రైతులు తమ ఇళ్లపై జెండాలు ఎగురవేస్తూ ప్రచారంలో భాగస్వాములవుతున్నారని వివరించారు. వాలంటీర్ల నియామకం, గ్రామాలు, మండల కేంద్రాల్లో జెండాలు, ఫ్లెక్సీల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో బెలూన్ల ద్వారా ప్రచారాన్ని మరింత విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా ప్రజలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 36వ జాతీయ కిసాన్ మహాసభలను విజయవంతం చేయాలని జూలకంటి రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వీరపల్లి వెంకటేశ్వర్లు, రైతు మహిళా రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, రాష్ట్ర సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారీ ఐలయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, సీఐటీయూ జిల్లా నాయకులు ఎండీ సలీం తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నల్గొండ జిల్లాలో వెట్టిచాకిరి నిర్మూలనకు సమష్టి కృషి చేయాలి





- **20 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు.. కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్గొండ, అక్టోబర్ 19(విజయ కెరటం):

నల్గొండ జిల్లాలో వెట్టిచాకిరి, బానిసత్వాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికులకు సంబంధించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా రూపొందించిన 'స్వేచ్ఛ రథాన్ని' ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరి, బానిసత్వం అనాదిగా కొనసాగుతున్న సామాజిక రుగ్మతలని పేర్కొన్నారు. వీటి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రచార రథాల ద్వారా 20 రోజులపాటు జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సంతలు, గ్రామ చావడులు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తామని వివరించారు.కళాకారుల పాటలు, దృశ్య రూపకాలు, కరపత్రాలు, గోడపత్రికల ద్వారా వెట్టిచాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లాలో వెట్టిచాకిరి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వెట్టిచాకిరికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే టోల్ఫ్రీ నంబర్ 08069434343కు తెలియజేయాలని కోరారు. కార్మిక, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల సమన్వయంతోనే వెట్టిచాకిరి, బానిసత్వాన్ని నిర్మూలించగలమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, కార్మిక శాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, సహాయ కమిషనర్లు పి. అరుణ, సయ్యద్ మొయిజుద్దీన్, జిల్లా సంక్షేమ అధికారి లావణ్య, ఏహెచ్టీయూ అంజలి, సీడబ్ల్యూసీ చైర్మన్ చింతా కృష్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి గణేష్, కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెట్టిచాకిరి నిర్మూలనపై రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

నల్గొండ అధికారుల సంక్షేమ సంఘం (నోవా) ఏకగ్రీవ ఎన్నిక

ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి మరింత కృషి చేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, అక్టోబర్ 19 (విజయ కెరటం):

నూతనంగా ఏర్పాటైన నల్గొండ అధికారుల సంక్షేమ సంఘం (నోవా) జిల్లా ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నోవా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.ఈ సందర్భంగా ప్రజావాణిలో నూతనంగా ఎన్నికైన సంఘం ప్రతినిధులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేస్తూ, ప్రజలకు మేలు కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

నూతన కార్యవర్గం వివరాలు:

– చైర్మన్: జె. శ్రీనివాస్ (అదనపు కలెక్టర్, రెవెన్యూ)

– ప్రెసిడెంట్: టి. విజయేందర్ రెడ్డి (జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి)

– జనరల్ సెక్రటరీ: సతీష్ కుమార్ (పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్)

– కోశాధికారి: ఎం.డి. అక్బర్ అలీ (జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి)

– ఉపాధ్యక్షులు: శశికళ (సాంఘిక సంక్షేమ శాఖ డీడీ), ఎం. గిరిధర్ (పంచాయతీరాజ్ ఈఈ)

– జాయింట్ సెక్రటరీలు: యు. వెంకటేశ్వర్లు (సమాచార శాఖ సహాయ సంచాలకులు), శాంతకుమారి (ఆర్డబ్ల్యూఎస్ డీఈ)

– కార్యవర్గ సభ్యులు: ఏ. సంజీవ (జిల్లా బీసీ సంక్షేమ అధికారి), కమలాకర్ రెడ్డి (జిల్లా గిరిజన సంక్షేమ అధికారి)

– ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు: పి. సాహితీ (జిల్లా ఉపాధి కల్పన అధికారి), లావణ్య కుమారి (జిల్లా సంక్షేమ అధికారి), వినోద్ కుమార్ (జిల్లా వ్యవసాయ అధికారి).

నూతనంగా ఏర్పాటైన నోవా కార్యవర్గానికి జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధిలో సంఘం క్రియాశీలకంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

దివంగత మొరిశెట్టి నాగేశ్వర్ రావుకు కంచర్ల భూపాల్ రెడ్డి నివాళులు

నల్లగొండ: అక్టోబర్ 19 విజయ కెరటం ప్రతినిధి



బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ దివంగత మొరిశెట్టి నాగేశ్వర్ రావు ద్వాదశ దిన కర్మ సందర్భంగా నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి రాఘవేంద్ర కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లారు. నాగేశ్వర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, నాగేశ్వర్ రావు తాను నమ్మిన ప్రజలకు నిరంతరం సేవలందించారని, తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమయ్యారని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ తరపున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస రెడ్డి, చిట్యాల మాజీ జడ్పీటీసీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న ఆసరా పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి

- **దరఖాస్తు చేసుకున్న అర్హులకు పెన్షన్లు అందించాలి: సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య**



నల్లగొండ, అక్టోబర్ 19 (విజయ కెరటం):

నాలుగేళ్లుగా ఆసరా కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఎం నల్లగొండ పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. దసరా నుంచి కొత్త ఆసరా పెన్షన్లు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆ హామీని అమలు చేయాలని కోరారు.ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు నెల రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించి, దసరా నుంచి పెన్షన్లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని సత్తయ్య తెలిపారు. అయితే, ప్రస్తుతం పెన్షన్ల మంజూరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. 2022లో చివరిసారిగా పెన్షన్లు మంజూరు చేశారని, అప్పటి నుంచి కొత్త పెన్షన్ల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.వృద్ధాప్య పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అనేక మంది అర్హులైన వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 57 ఏళ్ల నిండినా పెన్షన్లు అందక పలువురు నిరాశకు గురవుతున్నారని తెలిపారు.వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఫైలేరియా, బోదకాలు బాధితులు, చేనేత, గీత కార్మికులు సహా వివిధ వర్గాలకు చెందిన అర్హులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, పెన్షన్ పొందేందుకు అర్హులైన వృద్ధులకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

పెండింగ్ అర్జీలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ బి. హరిసింగ్

సూర్యాపేట, అక్టోబర్ 19 (విజయ కెరటం):



ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిల్లో స్వీకరించే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ప్రజావాణి ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పోర్టల్లో పెండింగ్లో ఉన్న అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు.ప్రతి అధికారి తమ లాగిన్లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. స్థానిక సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.

ప్రజావాణికి 25 దరఖాస్తులు

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 25 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 12, రెవెన్యూ శాఖకు ఒకటి, డీపీఓకు రెండు, డీఈఓకు రెండు, ఇతర శాఖలకు సంబంధించి ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు పంపించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో ప్రేమ్ రాజ్, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, సీపీఓ కిషన్, డీఎంహెచ్వో వెంకటరమణ, డీపీఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ అధికారి వెంకటరెడ్డితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ గ్రీవెన్స్ డే

15 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, అక్టోబర్ 19 (విజయ కెరటం):



ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది బాధితుల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించారు.ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను స్వయంగా అడిగి తెలుసుకున్న ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరిధిలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

నల్గొండలో పోలీసుల మెరుపు తనిఖీలు.. 59 మంది అదుపులోకి, 15 మందికి డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్!

ప్రవర్తన మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్గొండ, అక్టోబర్ 19 (విజయ కెరటం):

నల్గొండ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మెరుపు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, ట్రబుల్ మంగర్స్, గంజాయి, మత్తు టాబ్లెట్లు వినియోగిస్తున్న అనుమానితులపై తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో మొత్తం 59 మందిని అదుపులోకి తీసుకొని డీటీసీలో విచారించారు. డ్రగ్ టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, 15 మంది గంజాయి లేదా మత్తు టాబ్లెట్లు వినియోగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. మత్తు పదార్థాలను ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎవరు సరఫరా చేస్తున్నారు, ఇంకా ఎవరెవరు వినియోగిస్తున్నారు అనే అంశాలపై ప్రత్యేక పోలీసు బృందాలు విచారణ చేపట్టాయి. బాధితులకు కౌన్సెలింగ్ అందించడంతో పాటు అవసరమైన వారికి పునరావాస కేంద్రాలకు పంపించే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, బ్లాక్‌మెయిలర్లు, మత్తు పదార్థ వినియోగదారులపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్గొండ డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు ముత్తయ్య, సైదులు, టూటౌన్ ఎస్ఐ సైదాబాబు, రూరల్ ఎస్ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి: మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం, బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే 112 లేదా మత్తు పదార్థాల నిరోధక టోల్‌ఫ్రీ నంబర్ 8712670266కు తెలియజేయాలని జిల్లా పోలీస్ శాఖ కోరింది.

ప్రతిభావంతురాలైన నిరుపేద విద్యార్థిని రిషితకు రూ.55 వేల ఆర్థిక సాయం

నల్గొండ అక్టోబర్ 19 విజయ కెరటం ప్రతినిధి:

ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు 974 మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థిని నోముల రిషితకు నల్గొండ ఫైనాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, క్రెడాయ్ అసోసియేషన్‌లు రూ.55 వేల ఆర్థిక సహాయం అందించాయి.నల్గొండ పట్టణంలోని బొట్టుగూడకు చెందిన నోముల రిషిత, 2024--26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి 974 మార్కులతో ప్రతిభ కనబరిచింది. ఆమె ప్రతిభను గుర్తించిన ఘట్కేసర్‌లోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం సీఈసీ బ్రాంచ్‌లో కళాశాల ఫీజు లేకుండా, రూ.1.10 లక్షల హాస్టల్ ఫీజుతో ఉన్నత విద్య అభ్యసించే అవకాశం కల్పించింది.ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో నల్గొండ ఫైనాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, క్రెడాయ్ అసోసియేషన్ సభ్యులు రిషితకు అండగా నిలిచారు. సోమవారం ఉదయం 11 గంటలకు నల్గొండలోని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా రూ.55 వేల చెక్కును విద్యార్థినికి అందజేశారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, వ్యాపార సంస్థలు వ్యాపారంతో పాటు దానగుణాన్ని కలిగి ఉండటం అభినందనీయమన్నారు. రిషిత ఇంజనీరింగ్ విద్యలోనూ మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఆర్థిక సహాయం అందించిన దాతలు: ఆమంచి రాజలింగం, ఏ. శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు, ఎం. బాలాజీ నాయక్, బి. శివప్రసాద్, ఏ. చంద్రశేఖర్, ఎన్. మనోహర్, ఏ. శేఖర్, ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఏ. ఆది రెడ్డి, ఎం. భిక్షం, ఎన్. శ్రీనివాస్, ఏ. విజయ్, ఎం. శ్రవణ్, జి. రాంబాబు, ఎం. రామారావు, పృథ్వి, పి. వెంకట్ రెడ్డి, ఏ. శ్రీనివాస్, కె. విష్ణు, ఎం. మల్లేష్, కె. నరసింహ, ఎం. మల్లేష్ తదితరులు.ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆమంచి రాజలింగం, జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి మామిడి శ్రవణ్, క్రెడాయ్ కోశాధికారి నాంపల్లి మనోహర్, నేతి విప్లవ్ కుమార్, ఫైనాన్స్, క్రెడాయ్ అసోసియేషన్ల సభ్యులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నల్లగొండ పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ, వాహన పూజలు





జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ, అక్టోబర్ 19 (విజయ కెరటం):

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజలు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఎం.టి.) విభాగంలో పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో ప్రజలు అభివృద్ధి సాధిస్తూ విజయపథంలో ముందుకు సాగాలని కోరారు. ప్రజలందరూ పరస్పర ప్రేమాభిమానాలతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయుధాలు, పోలీస్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్రణ, అత్యవసర సమయాల్లో సత్వర సేవలు, ప్రజల భద్రతకు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కూడా విజయదశమి సుఖసంతోషాలు, ఆరోగ్యం, విజయాలను అందించాలని ఆకాంక్షించారు.ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగిస్తూ మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్పీ సీఐ నాగరాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐలు సంతోష్, శ్రీను, నరసింహ, సురప్ప నాయుడు, హరిబాబు, కళ్యాణ్ రాజ్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు 300 రోజుల కార్యాచరణ ప్రణాళిక

ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, అక్టోబర్ 19 (విజయ కెరటం):

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న 300 రోజులు అత్యంత కీలకమని, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని, ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెలల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గ్రామాలు, మున్సిపల్ పట్టణాల్లో వచ్చే ఆగస్టు వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల్లో నీటి వనరుల రిజిస్టర్లు నిర్వహించాలని, పైపుల లీకేజీలను అరికట్టి, పాడైన పైపులు, ట్యాంకులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ, అమృత్ పథకం అధికారుల సమన్వయంతో నీటి సరఫరా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.నీటి వృథాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని, వాహనాలను పైపులతో కాకుండా బకెట్లతో శుభ్రం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. దుకాణాలు, వాహనాల శుభ్రత కేంద్రాల్లో నీటి వృథాను నివారించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ అధికారులు రైతులకు ముందస్తు సూచనలు చేయాలని కలెక్టర్ తెలిపారు. యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే వేరుశనగ, జొన్నలు, మినుములు, కందులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. 90 రోజుల్లో పండే పంటలపై వివరించి, రైతులు పండించిన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



పాఠశాలలు, ఆసుపత్రుల్లో నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా నీటి కొరత ఉంటే భూగర్భ జల వనరులు, మిషన్ భగీరథ ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యార్థులు, పిల్లలు, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పశువులు, అటవీ జంతువులకు తాగునీటి కొరత రాకుండా నీటి లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి

పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పథకాలపై వివరించాలని, సోలార్ పంపుసెట్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలోనూ సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రజావాణికి 49 ఫిర్యాదులు

ప్రజావాణిలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. శేఖర్ రెడ్డి తదితర అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 21, ఇతర శాఖలకు 28 కలిపి మొత్తం 49 ఫిర్యాదులు అందాయి.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528